క్లుప్తంగా...

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: అత్వెల్లి సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని రూరల్ ఏఈ పవన్‌చంద్ తెలిపారు. అత్వెల్లి గ్రామ పరిధిలో అన్ని కాలనీలు, పరిశ్రమలకు, సోమారం గ్రామంలో, పరిశ్రమలకు, ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

కొర్రెముల్ స్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



విద్యార్థులతో ముఖ్యఅతిథులు ప్రొఫెసర్లు విజయ్‌కుమార్, మల్లేశ్

ఘట్‌కేసర్: కొర్రెముల్ జెడ్పీ పాఠశాలకు వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ) ఎన్‌సీసీ సెల్ ఆధ్వర్యంలో కంప్యూటర్ ల్యాబ్ విరాళమిచ్చారు. యూనివర్సిటీ ఎస్‌ఓఈ డీన్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లేశ్, హెడ్ వరలక్ష్మీ ముఖ్య అతిథులుగా హాజరై ల్యాబ్‌ను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించడానికి కంప్యూటర్ ల్యాబ్‌ను అందజేశామన్నారు. ఈసీఈ హెడ్, ప్రోగ్రామ్ అధికారి మధు, కోఆర్డినేటర్లు అజ్రిత్, సంతోశ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌టీసీలో అమృత్ కలశ యాత్ర



అమృత్ కలశ యాత్రలో విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌టీసీ కళాశాలలో మేరా మాటీ–మేరా దేశ్‌లో భాగంగా అమృత్ కలశ యాత్ర నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ రాజిరెడ్డి యాత్ర ప్రారంభించగా విద్యార్థులు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీరులను స్మరిస్తూ కార్యక్రమం చేపట్టారు. సీఈఓ అభినవ్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓ సాహుల్ మోపిదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

15 నుంచి కీసరగుట్టలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు



కీసర: ఈ నెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీభవానీ శివదుర్గదేవి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ, ఈఓ నరేందర్ అన్నారు. 9 రోజుల పాటు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. 15వ తేదీన అమ్మవారు స్వర్ణకవచ శివదుర్గాదేవి అలంకారం, 16న బాలత్రిపుర సుందరీదేవి అలంకరణ, 17న గాయత్రిదేవి అలంకరణ, 18న లలితాత్రిపుర సుందరీదేవి అలంకరణ, 19న అన్నపూర్ణాదేవి అలంకరణ, 20న మహాలక్ష్మీదేవి అలంకరణ, 21 దుర్గాదేవి అలంకరణ, 22న మహిషాసురమర్దిని అలంకరణ, 23న రాజరాజేశ్వరిదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు.

కార్మికుల భర్తీ లేదు.. స్వచ్ఛత జాడ లేదు..

- 13 పురపాలికల్లో ఔట్ సోర్సింగ్ కింద 1,746 మంది పారిశుద్ధ్య కార్మికులు
- ఏళ్లుగా భర్తీ కాని ఖాళీ పోస్టులు
- రెగ్యులర్ కార్మికులు లేక ఇబ్బంది
- భర్తీ చేయాలంటున్న పట్టణ ప్రజలు





సాక్షి, మేడ్చల్ జిల్లా: ఏళ్లుగా పోస్టుల భర్తీ లేకపోడంతో పురపాలికల్లో శాశ్వత పారిశుద్ధ్య కార్మికుల కొరత తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోంది. మురుగు కాల్వలు శుభ్రం చేసే కామాటీలు, రహదారులు, వీధులను శుభ్రం చేసే స్వీపర్లు తగినంత మంది లేకపోవడంతో పట్టణాల్లో స్వచ్ఛత గాడి తప్పుతోంది. జిల్లాలోని 13 పురపాలికల్లో ఇదే దుస్థితి నెలకొంది. నాటి నుంచి ఈ పట్టణాల్లో పారిశుద్ధ్య విభాగాల్లో ఒక్క పోస్టు కూడా భర్తీ కాలేదంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థమవుతోంది.

అమలుకు నోచుకోని నిబంధనలు

రాష్ట్ర పురపాలక శాఖ పరిపాలనా విభాగం నిబంధనల ప్రకారం ప్రతి 10వేల జనాభాకు 28 మంది రెగ్యులర్ పారిశుద్ధ్య కార్మికులు పనిచేయాల్సి ఉంటుంది. జిల్లాలోని 13 పురపాలికల్లో 2011 జనాభా లెక్కల ప్రకారం 4,24,239 జనాభా ఉంది. ప్రస్తుతం ఈ 13 పురపాలక సంఘాల్లో ఔట్ సోర్సింగ్ కింద 1,746 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు.

- గ్రేటర్ హైదరాబాద్ శివారుగా ఉన్న 13 పురపాలికల్లో గణనీయంగా జనాభా పెరుగుతుండటంతో 8 లక్షలు దాటవచ్చని అంటున్నారు. ఈ లెక్క ప్రకారం శివారు పురపాలక సంఘాల్లో 2,240 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేయాల్సి ఉంది.
- 13 పురపాలక సంఘాల్లో ప్రస్తుతం రెగ్యులర్ పారిశద్ధ్య కార్మికులు ఒక్కరు కూడా లేకపోవడం గమనార్హం. పురపాలికల్లో ఔట్ సోర్సింగ్ సేవల కింద నియమించిన కార్మికులతోనే పారిశుద్ధ్య వ్యవస్థను కొనసాగిస్తున్నారు.

ప్యానల్ పోస్టులకే ప్రాధాన్యం

పురపాలికల్లో కమిషనర్లు, ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, మేనేజర్లు, అకౌంటెంట్లు, ఆర్ఐలు, క్లర్కులు, బిల్ కలెక్టర్లు వంటి ప్యానల్ పోస్టులను మాత్రమే భర్తీ చేస్తున్న ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల విషయాన్ని మాత్రం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. గడిచిన రెండేళ్లలో టీఎస్పీఎస్సీ ద్వారా జిల్లాలోని పురపాలికల్లో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, రెవెన్యూ విభాగాల్లో ప్యానల్ పోస్టులు భర్తీ అయ్యాయి. అవసరం ఉన్న పారిశుద్ధ్య కార్మికుల పోస్టులు మాత్రం ఖాళీగానే ఉండిపోయాయి.

పురపాలక సంఘాల వారీగా..

మేడ్చల్ జిల్లాలోని 13 పురపాలక సంఘాల్లో ఔట్ సోర్సింగ్ కింద 1,746 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తుండగా, ఇందులో పురపాలికల వారీగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య ఈ విధంగా ఉంది. పీర్జాదిగూడలో 56 మంది పారిశుద్ధ్య కార్మికులు, నిజాంపేటలో 248, నాగారంలో 145, మేడ్చల్‌లో 139, కొంపల్లిలో 188, జవహర్‌నగర్‌లో 90 మంది పనిచేస్తున్నారు. అలాగే, బోడుప్పల్‌లో 182, దుండిగల్‌లో 150, ఘట్‌కేసర్‌లో 86, గుండ్లపోచంపల్లిలో 120, దమ్మాయిగూడలో 157, పోచారంలో 111, తూముకుంటలో 74 మంది పారిశుద్ధ్య కార్మికులు ఔట్ సోర్సింగ్ కింద సేవలందిస్తున్నారు.

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు



మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాగారం మున్సిపల్ వాసులు

కీసర: బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పెద్దఎత్తున ప్రజలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గురువారం రాత్రి నాగారం మున్సిపాలిటీ ఒకటో వార్డులో వివిధ పార్టీలకు చెందిన నేతలతో పాటు వివిధ కాలనీవాసులు పెద్ద ఎత్తున మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మల శ్రీనివాస్, నేతలు గండి అంజయ్యగౌడ్, రమేష్ గుప్తా, అరిగే రాములు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ లావణ్య, సిబ్బంది

మేడ్చల్‌రూరల్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మేడ్చల్ పోలీసులు 44వ జాతీయ రహదారిపై ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల పరివర్తనా నియమావళి అమలులో ఉండటంతో రూ.50 వేలకు మించి నగదు తమ వెంట తీసుకెళ్లవద్దనే నిబంధన, ఒక వేళ ఉంటే ఆధారాలు చూపాల్సి ఉండటంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మేడ్చల్ సీఐ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా సరిహద్దు అయిన డబిల్‌పూర్ చౌరస్తా సమీపంలో 44వ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వివిధ పార్టీలు నగదు, మద్యం సరఫరాను అరికట్టేందుకు ఉదయం మొదలు అర్ధరాత్రి సైతం వాహనాలకు తనిఖీ చేస్తున్నారు. శుక్రవారం మేడ్చల్ ఎస్ఐ లావణ్య ఆధ్వర్యంలో ఏఎస్ఐ ఆనంద్‌కుమార్, సిబ్బంది జాతీయ రహదారిపై మెదక్ జిల్లా నుంచి నగరానికి వచ్చే వాహనాలు, నగరం నుంచి ఇతర జిల్లాలకు వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు.

సీఎం సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

శామీర్‌పేట్: మేడ్చల్ నియోజకవర్గంలోని గుండ్లపోచంపల్లిలో ఈ నెల 18న నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. శామీర్‌పేట్ మండలంలోని అలియాబాద్‌లోని ఓ కన్వెక్షన్ హాల్‌లో నిర్వహించిన శామీర్‌పేట్, మూడు చింతలపల్లి మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను ఎమ్మెల్యే అయిన తర్వాత తొలిసారి నియోజకవర్గంలో బహిరంగ సభకు కేసీఆర్ వస్తున్న సందర్భంగా ప్రతి కార్యకర్త సభలో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అలిగిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు..

బీఆర్ఎస్‌లో తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని శామీర్‌పేట్ ఎంపీపీ ఎల్లుబాయి, వైస్ ఎంపీపీ సుజాత, పలువురు ఎంపిటీసీలు అలిగి సమావేశానికి దూరంగా ఉన్నారు. అలియాబాద్‌లో మంత్రి సమావేశం ఉండటంతో అలక మంచం ఎక్కిన సదరు నేతలు మజీద్‌పూర్‌లోని ఓ రెస్టారెంట్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి మల్లారెడ్డి వారిని బుజ్జగించాలని తన బావమరిది మద్దుల శ్రీనివాస్‌రెడ్డికి ఆదేశాలు ఇవ్వడంతో ఆయన వారి వద్దకు వెళ్లి బుజ్జగించి సమావేశానికి తీసుకువచ్చారు.

దివ్యాంగులకు 'డబుల్' మోసం

- డబుల్ ఇళ్లు ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు
- అడిగితే.. ఇప్పుడు ముఖం చాటేస్తున్నాడు
- టీఆర్‌వీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోనార్ దుర్గప్రసాద్



మాట్లాడుతున్న బీఆర్‌వీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోనార్ దుర్గప్రసాద్

జవహర్‌నగర్: ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో దివ్యాంగులను మోసం చేసిందని టీఆర్‌వీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోనార్ దుర్గప్రసాద్, మేడ్చల్ నియోజకవర్గ అధ్యక్షుడు బత్తిని భిక్షపతిగౌడ్ అన్నారు. శుక్రవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో దివ్యాంగులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందజేయాలని విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోనార్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. 2018లో మంత్రి మల్లారెడ్డి ఎన్నికల్లో గెలిచాక దివ్యాంగులకు తప్పకుండా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని లిఖితపూర్వక హామీ ఇచ్చారని, అధికారులతో కలిసి 65 మంది దివ్యాంగులకు వెరిఫికేషన్ చేశారని, ఇప్పుడు డ్రా ద్వారా ఇళ్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసున్న వారికి తీస్తున్నారన్నారు. తాము మంత్రి మల్లారెడ్డిపై పూర్తి నమ్మకంతో ఆన్‌లైన్‌తో దరఖాస్తు చేసుకోలేదన్నారు. ఈ విషయంపై ఆయనకు తెలపగా తాను ఏమీ చేయలేనని ముఖం చాటేశారన్నారు. హామీ ఇచ్చిన మంత్రి మల్లారెడ్డి తమకు డబుల్ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నేతి శ్రీధర్, వంగ శ్రీనివాస్‌రెడ్డి, పెద్ద మేతరి రాము, ధనరాజ్, రమేష్, సాయి, శ్రీను, పర్వతోజు బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 2050



కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్‌జిల్లా: ఎన్నికల నేపథ్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ప్రజలు, ఓటర్ల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్లో 24 గంటలు పనిచేసే విధంగా ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సమయంలో ఏమైనా ఫిర్యాదులు ఉంటే జిల్లా ప్రజలు, ఓటర్లు టోల్ ఫ్రీ నంబర్ 1800425 2050కు ఫోన్ చేయడానికి అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అలాగే ఎన్నికల కమిషన్ రూపొందించిన సువిధ యాప్‌ను కూడా వాడుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు డబ్బు తరలింపులు, ఇతర ప్రలోభాలకు గురి చేసినట్లు ఎవరైనా గుర్తిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందజేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు.

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: అత్వెల్లి సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని రూరల్ ఏఈ పవన్‌చంద్ తెలిపారు. అత్వెల్లి గ్రామ పరిధిలో అన్ని కాలనీలు, పరిశ్రమలకు, సోమారం గ్రామంలో, పరిశ్రమలకు, ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

బీఆర్ఎస్ వైఫల్యాలను గడపగడపకూ తీసుకెళ్లాలి

మైనంపల్లి హన్మంత్‌రావు



మాట్లాడుతున్న మైనంపల్లి హన్మంత్‌రావు

శామీర్‌పేట్: బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను కాంగ్రెస్ కార్యకర్తలు గడపగడపకూ తీసుకెళ్లాలని మల్కాజిగిరి మైనంపల్లి హన్మంత్‌రావు అన్నారు. శామీర్‌పేట్‌లో కాంగ్రెస్ నాయకుడు నక్కా ప్రభాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ ఆత్మీయ భరోసా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలన్నింటినీ పార్టీ కార్యకర్తలకే కేటాయించారని, రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలే ప్రజలకు లబ్ధి చేకూర్చేవని, తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరించాలని కోరారు. అంతకుముందు నక్కా ప్రభాకర్‌గౌడ్, వజ్రేష్ యాదవ్‌లు మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గాన్ని మంత్రి మల్లారెడ్డి దోచుకుని తిన్నాడే.. తప్ప అభివృద్ధి చేసిందేమీలేదన్నారు. నియోజకవర్గంలోని వేల ఎకరాలు కబ్జా చేసి డబ్బులు సంపాదించాడని, రానున్న ఎన్నికల్లో మేడ్చల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. సమావేశంలో నాయకులు ఉద్దమర్రి నర్సింహారెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వైఎస్ గౌడ్, నర్సింహులు యాదవ్, మున్సిపల్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

- 2 గంటల పాటు కార్యక్రమం
- భారత్ వరల్డ్ రికార్డులో చోటు



భారత్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్లు అందజేస్తున్న దేవేందర్ తదితరులు

ఘట్‌కేసర్: మానసిక ఆరోగ్య సమస్యలు నివారించడంలో భాగంగా వరల్డ్ మెంటల్ హెల్త్ డేను వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో మనోజాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ప్రముఖ మానసిక నిపుణుడు, మానసిక ఆరోగ్య శిక్షకుడు డాక్టర్ మహిపతి శ్రీనివాసరావుకు భారత్ వరల్డ్ రికార్డులో చోటు లభించింది. ఉన్నతమైన, ఉల్లాసవంతమైన, ఆరోగ్యమైన సమాజ నిర్మాణంలో భాగంగా రెండు గంటల పాటు మానసిక ఆరోగ్యంపై గ్రూపు డిస్కషన్‌లో 100 మంది సైకాలజిస్టులు, కౌన్సిలర్లు సింగిల్ వెన్యూలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా అడిషనల్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా, భారత్ వరల్డ్ రికార్డు ప్రతినిధి డాక్టర్ దేవేందర్ బండారి హాజరయ్యారు. రెండు గంటల పాటు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించిన వారందరికీ భారత్ వరల్డ్ రికార్డు సంస్థ సర్టిఫికేట్లు అందజేసింది.

ఉప్పల్‌లో 100 పడకల ఆస్పత్రి

- అపరిష్కృత స్థలాలను రెగ్యులరైజ్ చేయించా..
- ఎవరికి ఏ కష్టం వచ్చినా మీ ముంగిట ఉంటా
- ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి

ఉప్పల్: మీలో ఒకడిగా ఆశీర్వదించండి.. నిరంతరం సేవ చేస్తానని ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. చిలుకానగర్ డివిజన్‌లో కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షుడు పల్లె నర్సింగ్ రావు అధ్యక్షతన నాచారంలోని బాబా ప్యాలెస్‌లో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనకు మహిళలు బతుకమ్మ, బోనాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తన ట్రస్టు ద్వారా ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందన్నారు. తనను బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న స్థలాలను రెగ్యులరైజ్ చేయించానన్నారు. ఇక్కడి ప్రజలు పెద్దాస్పత్రి కావాలని దశాబ్దకాలంగా కృషి చేస్తున్నారని, వెంటనే ఉప్పల్‌లో 100 పడకల ఆస్పత్రి మంజూరు చేయించినట్లు చెప్పారు. డిగ్రీ కళాశాలకు భవనం, త్వరలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. విదేశాల్లో చదువుకునే వారికి, ఆడపిల్లల పెళ్లిళ్లు, చదువు, ఇలా ఎవరికి ఏ కష్టం వచ్చినా మీ ముంగిట ఉంటానని హామీ ఇచ్చారు. అర్హులైన వారికి బీసీ, దళిత బంధు, గృహలక్ష్మీ ఇప్పించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, నెర్ధం భాస్కర్‌గౌడ్, జెల్లి మోహన్, అంబటి జగదీష్, గోపు సదానంద్, రమేష్, మైనార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేద్దాం

తోటకూర వజ్రేష్‌యాదవ్



బోడుప్పల్: కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పలు డివిజన్లలో గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో ప్రజల నుంచి స్పందన లభిస్తోందన్నారు. మేడ్చల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త సుశాంత్‌గౌడ్, బీబ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు బొమ్మక్ కళ్యాణ్ కుమార్, తోటకూర అజయ్‌యాదవ్, బోడుప్పల్ ప్రధాన కార్యదర్శులు కొత్త ప్రభాకర్ గౌడ్, విశ్వంగుప్తా, నేతలు బొమ్మక్ రమేష్, వెంకటేశ్‌గుప్తా, తోటకూర అశోక్‌యాదవ్, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలు



నాగారంలోని ది రెయిన్‌బో ల్యాండ్ ప్లే స్కూల్ ఆధ్వర్యంలో..



యంనంపేట్‌లోని రాక్ ఉడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో..

చర్లపల్లి జైల్‌లో నర్సరీ ఏర్పాటు



చర్లపల్లి జైల్‌లో నర్సరీని ప్రారంభిస్తున్న డాక్టర్ డి.శ్రీనివాస్

కుషాయిగూడ: చర్లపల్లి కేంద్ర కారాగారంలో నూతనంగా నర్సరీని ఏర్పాటు చేశారు. శుక్రవారం జైళ్లశాఖ హైదరాబాద్ రేంజ్ డీఐజీ డాక్టర్ డి.శ్రీనివాస్ నర్సరీని ప్రారంభించారు. జైల్‌లో నర్సరీ ఏర్పాటు చేసి 20 వేల మొక్కలను అందుబాటులో ఉంచడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో జైల్ పర్యవేక్షణాధికారి సంతోష్‌కుమార్‌రాయ్, ఓపెన్ ఎయిర్ జైల్ పర్యవేక్షణాధికారి కళాసాగర్, శశికాంత్, రామకృష్ణ, పరుశరాం, సత్తయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించని వారికి జైలు

మల్కాజిగిరి: ట్రాఫిక్ రూల్స్ పాటించని వాహనదారులకు ఐదవ స్పెషల్ ఎంఎం కోర్టు జైలుశిక్ష, జరిమానా విధించిందని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ తెలిపారు. నంబర్ ప్లేట్స్ సరిగాలేని ఒకరికి రూ.3 వేలు, ఏడు రోజులు జైలు, ఒకరి రూ.3 వేలు, ఒకరోజు జైలు, మరొకరికి రూ.2 వేలు, ఒకరోజు జైలు, మద్యం తాగినవారిలో 14 మందికి రూ.2 వేల జరిమానా విధించిందన్నారు.